మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి:కలెక్టర్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 09, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోతిలాల్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు తీసుకోవడమే కాకుండా సత్వరమే పరిష్కరించి అర్జీదారునికి తగిన న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు, ఇతరాత్ర కలిపి మొత్తం 38 ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా సమయానికి రావాలని, అనుమతి లేనిదే గైర్హాజరు కావద్దని ఆదేశించారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను నేరుగా ధరణిలోనే అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలకు 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్‌తో కలిసి మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మునవర్ సుల్తానా ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే ప్రభుత్వం నూతన భవనాన్ని నిర్మించేందుకు నిధులు కేటాయిస్తుందని ఆమె కలెక్టర్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ బిజనపల్లి, తాడూర్ తహసీల్దార్లు వెంటనే 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మైనార్టీ గురుకుల పాఠశాలకు కేటాయించేలా ఆదేశాలు జారీ చేయాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దినపత్రికలలో వచ్చిన వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 09 ప్రభాతవార్త :** కలెక్టర్ ఆఫీస్‌లో అద్దె వసూలు శీర్షికన కొన్ని దినపత్రికలలో ప్రచురితమైన వార్తకు జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు స్పందించారు. గతనెల 4వ తేదీన మహబూబ్‌నర్ జిల్లా పాలకొండ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రారంభించిన నూతన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం సముదాయంలో ప్రతినెల 5వ తేదీన ప్రభుత్వ శాఖలు అద్దె చెల్లించాలంటూ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు హుకుం జారీ చేశారని పేర్కొంటూ ప్రచురితమైన వార్తకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు స్పందించారు. ఈ వార్తలో నిజం లేదని, శానిటేషన్, గార్డెన్, సెక్యూరిటీ సిబ్బంది నిర్వహణ, వేతనాల చెల్లింపుకై రెమ్యునరేషన్ ఇవ్వాలని మాత్రమే కోరడం జరిగిందని, ఎలాంటి అద్దె కాదని స్పష్టం చేశారు. ప్రతి కార్యాలయం తప్పనిసరిగా మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకించి శానిటేషన్, స్వీపర్, గార్డెనింగ్ తదితరాల కోసం తప్పనిసరి చెల్లింపులు చేయాల్సి ఉంటుందని, గతంలో అన్ని కార్యాలయాలు అలా చేసేవారని, ఇప్పుడు అన్ని ఒకేచోటికి వచ్చినందున, ఈ మొత్తాన్ని అన్ని కార్యాలయాలు ఓఓ బడ్జెట్ నుండి షేర్ చేసుకోవాలసి ఉందని తెలిపారు. ఒకవేళ లేనట్లయితే ప్రతి కార్యాలయానికి వీటి నిర్వహణ కష్టమని ఆయన స్పష్టం చేశారు. వార్తలో పేర్కొన్నట్లుగా నెలనెలా అద్దె వసూలు చేయాలని హుకుం జారీ చేశారన్నది అబద్ధమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రజావాణి ద్వారా అందిన అర్జిలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలి..

### వనపర్తి జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ భాష

**వనపర్తి ప్రతినిధి,జనవరి09 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా అర్జిదారుల నుండి అందిన దరఖాస్తులను జాప్యం లేకుండానే వెంటనే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ షేక్‌యాస్మిన్ భాష జిల్లా అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దరఖాస్తు దారులతో ఆమె మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ లకు సంబందించిన దరఖాస్తులు 01 అందగా ఇతర శాఖలకు సంబందించిన దరఖాస్తులు 22 మొత్తం 23 దరఖాస్తులను ఆమె స్వీకరించినట్లు తెలిపారు.అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిశీలించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ రెవెన్యూ డి.వేణుగోపాల్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ..

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి9,ప్రభాతవార్త :** తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి,ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి , కలెక్టర్ వెంకట్రావు కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈమేరకు సంఘం ఉద్యోగులు కలెక్టరేట్‌లో సోమవారం నూతన క్యాలెండర్‌లను మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ నిజాపాషా, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, డీఈవో రవీందర్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి మురళీ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దశరథ్, జిల్లా జాయింట్ సెక్రెటరీ సరళ, గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో మంజుల, నాగ్య నాయక్,రాజునాయక్, వెంకటయ్య, ఉమాదేవి,వసంత,కవిత,నిర్మల, ఉమాదేవి,వెంకటయ్య,నాగయ్య, టీజీవో సెక్రెటరీ, బక్క శ్రీనివాసులు, టీజీవో ప్రెసిడెంట్ రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్..

### సంక్రాంతి తర్వాత అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు: ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి




గౌరారంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**బిజినేపల్లి,జనవరి 09 ప్రభాతవార్త :** ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించేందుకే మార్నింగ్ వాక్ కార్యక్రమానికి సంకల్పించినట్లు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గౌరారం, గౌరారం తండా పంచాయతీలలో సోమవారం గుడ్‌మార్నింగ్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది ప్రజలు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పింఛన్ల మంజూరు చేయాలని ఆయనకు విన్నవించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నుండి అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో పింఛన్ కట్ అయిన వారిని గుర్తించి వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక బడుగు, బలహీన వర్గాల బతుకుల్లో వెలుగులు వచ్చాయన్నారు. ప్రజల సంక్షేమం కోసం గుడ్‌మార్నింగ్ ఎమ్మెల్యే కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొందరు రాజకీయ లబ్దికోసం అసత్య ప్రచారాలు చేసి ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నారని అలాంటి వారి మాటలను నమ్మవద్దని అన్నారు. గతంలో 30 ఏళ్ల పాలనలో ప్రతిపక్ష నాయకులు ఏం చేశారో మీ కందరికి తెలుసన్నారు. ఎనిమిదేళ్ల టిఆర్ఎస్ పాలనలో సీఎం కెసిఆర్ పేదలసంక్షేమం కోసం ఎన్నోసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాడని వివరించారు. ప్రతిపక్ష నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్‌కమిటి ఛైర్మన్ కిరణ్, రైతుబంధు మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ అంజిరెడ్డి, ఎంపిడిఓ కృష్ణయ్య, ఎంపిఓ రాములు నాయక్, పిఎసిఎస్ ఛైర్మన్ బాలరాజ్‌గౌడ్, ఎంపిటిసిల సంఘం జిల్లా కన్వీనర్ మంగి విజయ్, టిఆర్ఎస్ మండలయూత్ అధ్యక్షుడు ముడావత్ రాము నాయక్, అనమోని శ్రీశైలం, బిస్మిల్లా గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

# పేదల ఆరోగ్యం...

# ప్రజా సంక్షేమమే లక్ష్యం..!

- మన ఊర్లో మన ఇంటికొచ్చి కంటి పరీక్షలు..
- డబ్బులు పెట్టి బయట క్యూలో నిలబడి చేయించుకోవాల్సిన పనిలేదు..
- ఇది రాజకీయ పథకం కాదు..
- గత లోపాలను సరిదుద్దుకొని ముందుకెళ్లాలి: ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- కలెక్టరేట్‌లో కంటి వెలుగు పథకంపై అవగాహన పాల్గొన్న ఎమ్మెల్యే ఆల, కలెక్టర్ వెంకట్రావు




మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి9,ప్రభాతవార్త :** మనం ఇతర ప్రాంతాలకు వెళ్లి డబ్బులు కట్టి, క్యూలో నిలబడి కంటి పరీక్షలు చేయించుకునే పరిస్థితి పేదలకు రావొద్దని, మన ఊరికి వచ్చి, మన ఇంటి వద్దే కంటి పరీక్షలు అందరికీ ఉచితంగా పరీక్షలు చేసి అద్దాలు కూడా అందించే అద్భుత కార్యక్రమం కంటి వెలుగు అని, ఇలాంటి పథకం దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదని పర్యాటక,ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ నూతన కలెక్టరేట్ కార్యాలయంలో కంటి వెలుగు పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరు కాగా, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఏ ఒక్కరు కూడా నిర్లక్ష్యంగా ఉండొద్దని సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ప్రతి గ్రామంలో ఫ్లెక్సీలు, పట్టణాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, రాజకీయం చేయకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గతంలో కళ్లద్దాలను చైనా నుంచి తయారు చేసినవి దిగుమతి చేసుకొని పంపిణీ చేశామని, కానీ మేడ్ ఇన్ తెలంగాణ అద్దాలను అందచేస్తున్నట్లు తెలిపారు. రెండు మోడళ్లలో అద్దాలను నాణ్యతంగా తయారు చేయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు హెల్త్ క్యాంపులు అంటే టెంట్ వేసి ఒకరోజు ఏర్పాటు చేసి మమా అనిపించే వారని, కానీ ప్రస్తుతం 100 రోజుల ప్రత్యేకంగా అన్ని గ్రామాల్లో 18ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేసేలా కార్యాచరణ రూపొంచామన్నారు. నియోజకవర్గం, మండలం,గ్రామాల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, మండలం,గ్రామ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈనెల 18నుంచి క్షేత్ర స్థాయిలో కంటి వెలుగు పథకంలో భాగంగా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడా కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో దండోరా వేసి ప్రచారం చేయాలన్నారు. పరీక్షలు చేయించుకునే వారికి కొంత ఆలస్యం జరిగినా ఇబ్బంది లేకుండా భోజన వసతి కల్పించాలని సూచించారు.



అవగాహన కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు



కంటి వెలుగు పథకం కరపత్రం విడుదల చేస్తున్న మంత్రి , జెడ్పీ చైర్ పర్సన్ , ఎమ్మెల్యే ఆల, కలెక్టర్

### గ్రామాల్లో ప్రచారం చేయాలి:ఎమ్మెల్యే ఆల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల

కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో ప్రతి కార్యకర్త, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని, విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. రేపు,ఎల్లుండి మండలాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే జిల్లాకు 40వేల కళ్లద్దాలు వచ్చాయన్నారు. పరీక్షల కోసం వచ్చే వారికి, అధికారులకు, వైద్యులకు భోజనం ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వంలో పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. కంటి వెలుగు పథకం అద్భుత పథకమని అందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్మన్లు కేసీ నర్సింహులు, బస్వరాజు, దోరేపల్లి లక్ష్మి,ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దళారుల జోక్యం లేకుండానే పథకాల అమలు..

### లబ్ధిదారుల ఇంటికి నేరుగా చేర్చాలి:మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జనవరి9,ప్రభాతవార్త:** దళారుల జోక్యం అవసరం లేకుండానే నేరుగా లబ్ధిదారుల ఇంటికి పథకాలు చేర్చాలన్నదే తమ లక్ష్యమని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జీవో నెంబర్ 58 కింద రెగ్యులరైజేషన్ అయిన వారికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు.జీవో నెంబర్ 58 కింద అనధికార స్థలాల రెగ్యులరైజేషన్ పొందిన వారికి అండగా ఉంటామన్నారు. మొత్తం 313 దరఖాస్తులు రాగ, అందులో 231 దరఖాస్తులను

-మిగతా2లో..

## దాడి చేసిన వ్యక్తులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 09, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూ ల్ జిల్లా బిజనపల్లి మండలం మమ్మాయిపల్లి గ్రామంలోని మా ర్కండేయ ప్రాజెక్ట సందర్శనకు వెళ్లిన వాల్యనాయక్, ఎస్సీ రా ములుపై బీఆర్ఎస్ నాయకులు అతి పాశవికంగా దాడి చేసి చంపే ప్రయత్నం చేసిన విషయంపై బిజనపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మూ డు రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

-మిగతా2లో..

# పట్టణాన్ని నలువైపులా..

# అభివృద్ధి చేసేందుకు చర్యలు..!

- డబుల్ బెడ్‌రూం ఇండ్లు, బైపాస్ రహదారితో వీరన్నపేటకు ప్రాధాన్యం పెరిగింది
- గతంలో మౌలిక వసతుల లేమితో వీరన్నపేట ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు
- ఇప్పుడు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాం
- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్



వీర్నపేట న్యూ రైల్వే గేట్ సమీపంలో సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి



వీరన్నపేట మక్కా మసీదు సమీపంలో సిసి రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమిపూజ

మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 09 ప్రభాతవార్త : 2014కు పూర్వం మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట ప్రాంతంలోని ప్రజలు కనీస మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, రహదార సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురయ్యారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిరోజు మిషన్ భగీరథ తాగునీటితో పాటు,విద్యుత్ సమస్యను తీర్చామని, వీధి వీధికి సిసి రోడ్లను నిర్మించామని,ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవని మంత్రి అన్నారు. సోమవారం ఆయన వీరన్నపేట ప్రాంతంలో సుమారు రూ. 74.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న పలు సిసి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పనుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు పనుల నాణ్యతను పరిశీలించారని, త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. 2014కు పూర్వం వీరన్నపేట ఏరియాలో లాంటి వసతులు ఉండేవి కాదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్ పట్టణాన్ని నలువైపులా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే వీరన్నపేటలో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంతో పాటు బైపాస్ రహదారిని తీసుకొచ్చామని, దీనివల్ల వీరన్నపేటకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. వీరన్నపేట ప్రాంతం నుండి హైదరాబాద్ వెళ్లేందుకు కేవలం గంటలో వెళ్లవచ్చని గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ఇప్పుడు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో పేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే స్థలం ఉన్నట్లయితే ముఖ్యంగా ఇండ్లు పడిపోయిన వారికి ప్రాధాన్యతనిస్తూ డబుల్ బెడ్‌రూం ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మున్సిపాలిటీలో సుమారు 19 వేల పెన్షన్లను ఇస్తున్నామని, వీరన్నపేట పరిధిలో కూడా పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. అన్నివైపులా పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఆయా వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## సర్వేంద్రియానం... నయనం ప్రధానం..!

### కంటి వెలుగు బృహత్తర కార్యక్రమం... -వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 09, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలో నుంచి వచ్చిన ఒక బృహత్తర కార్యక్రమం కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు మమేకమై మనస్సు పెట్టి పనిచేసి విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జనవరి 18 నుంచి ప్రారంభమయ్యే రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధుల సహకారంతో 100 శాతం విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

-మిగతా4లో..

## బడికి పోవాలని ఉన్నా ... బస్సు లేదయే ..!

**బిజినేపల్లి,జనవరి 09 ప్రభాతవార్త :** బడికి పోయి బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేయాలని ఉన్నా బడికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆ చిన్నారి కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని ఆవేదన చెందుతుంది. గౌరారం గ్రామానికి చెందిన సొంటె లింగం కుమార్తె రూప మంగనూరు గ్రామంలోని 5వ తరగతి చదువుతోంది. కాగా సుమారు 4 కి.మీ. దూరం కాలినడకన వెళ్లి చదువుకుని కాలినడకనే తిరిగి రావాల్సి వస్తోంది. ఈక్రమంలో గ్రామంలో నిర్వహిస్తున్న గుడ్‌మార్నింగ్ ఎమ్మెల్యే ప్రోగ్రామ్‌కు సోమవారం అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కారు ఆపి విద్యార్ళును నడుచుకుంటూ వెళ్తున్నారని అడగగా బస్సు లేకపోవడంతో నిత్యం నడుచుకుంటూ బడికి వెళ్లి వస్తున్నామని, సైకిల్ ఇప్పిస్తే రోజు బడికి వెళ్తానని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి ధైర్యంగా చెప్పింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అక్కడున్న గ్రామస్తలను, అధికారులను బస్సు సౌకర్యం ఎందుకు లేదో అడిగి తెలుసుకున్నారు. గతంలో బిజినేపల్లి నుండి జల్లాఘనపూర్‌కు బస్సు ఉండేదన్నారు. ప్రస్తుతం బస్సు రద్దు చేయడంతో ప్రజలు, పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే ఎంతమంది విద్యార్థులు ఉన్నారో వారందరికి సైకిల్ ఇప్పిద్దామని ఆదేశించారు. దీంతో ఆ బాలిక ఎంతో సంబరపడిపోయింది. తనతోపాటు బడికి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్న తోటి విద్యార్థులందరికి కూడా ఎమ్మెల్యే సైకిళ్లు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆ బాలిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థిని రూపతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలి...

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.అశోక్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 09, ప్రభాతవార్త:**అంగన్‌వాడీ టీచర్లకు భారంగా మారిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జీ.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోశన్ ట్రాక్టర్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పనిచేస్తున్నారని, మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను



తీసుకొని రావడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని సూచించారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, జగదీష్, శివరాం తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఫాతిమా షేక్ జయంతి ఉత్సవాలు...

**కల్వకుర్తి, జనవరి 09, ప్రభాతవార్త:**చదువుల తల్లి సావిత్రిబాయి పూలేతో పాటు విద్యను అందరికి అందించాలనే లక్ష్యంతో పనిచేసిన ముస్లిం మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని రేష్మ కొనియాడారు. ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలో ముస్లిం మహిళా సోదరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ మహిళలకు విద్యను అందించాలనే సంకల్పంతో సావిత్రిబాయి పూలేతో



నడుం బిగించి ఎంతో మందికి విద్యను అందించారన్నారు. కార్యక్రమంలో రెహానా, రాజేశ్వరి, మాలతి, పూర్ణిమ, షభానా మహిళలు తదితరులు ఉన్నారు.

## స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్‌కు శుభాకాంక్షలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 09, ప్రభాతవార్త:**హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయగౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంజనేయగౌడ్‌ను ఆయన చాంబర్‌లో గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి అభినందించారు. ఆంజనేయగౌడ్‌ను



సన్మానించిన వారిలో వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ గోరటి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజశేఖర్, సాయినాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రామాలలో పనులు చేసిన బిల్లులు ఇవ్వాలని మండల సభలో సర్పంచ్‌ల ఆవేదన..

**అమరచింత,జనవరి 09 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు అప్పులు చేసి పనులు చేసిన బిల్లులు ఇవ్వడం లేదని ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు ఇవ్వాలని ఆయా గ్రామాల సర్పంచులు మండల సభలో ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అమరచింత మండల సర్వసభ సమావేశం లో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చుక్క మాలతి అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీరు అందిస్తామని చెప్పిన అధికారులు మస్తీపూర్, నందిమల్ల, చంద్రగడ్ గ్రామాలలో ఇప్పటి వరకు మిషన్ భగీరథ



నీరు రావడం లేదని ఆయా గ్రామాల సర్పంచులు ఏఈ ని ప్రశ్నించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేసుకుందామని చుక్క మాలతి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మెన్ ఎస్.ఎరాజు, తహసిల్దార్ షేక్ చాంద్ పాష, జడ్పీటీసీ సరోజ పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇండ్లులేని పేదలకు స్థలాలు ఇవ్వాలి..

**సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు**

**అమరచింత,జనవరి 09 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఇండ్లులేని పేదలకు పట్టాలిచ్చిన హద్దులు చూపడం లేదని జిల్లాలో పట్టాలు పొందిన ఇండ్లులేని పేదలకు స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన తహసిల్దార్ కా



ర్యాలయంముందు ధర్నా నిర్వహించిన తహసిల్దార్ షేక్ చాంద్‌పాష కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయరాములు మా ట్లాడారు ప్రభుత్వం పేదలకు పట్టాలిచ్చి ఏండ్లు గడుస్తున్న ప్రభుత్వం హద్దులు చూపకుండా కాల యాపన చేస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వం పట్టాలుపొందిన పేదలకు హద్దులు చూపాలని లేనిచో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు సిద్దమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, భాస్కర్, కుతుబ్, రవీందర్, గీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**వెల్దండ, జనవరి 09, ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పెద్ద ఎత్తున యువతులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు, మహిళలకు గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, వాసవీక్లబ్ ఇంటర్నే షనల్ 108 రీజియన్ చైర్మన్ రమేష్, క్లబ్ ఉపాధ్యక్షులు బాదం రాఘవేందర్, వాసవీక్లబ్ మహిళా అధ్యక్షురాలు బాదం సక్కుబాయిల చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పూరి వజ్రలింగం, క్లబ్ సభ్యులు సంతోష్, నాగరాజు, జ్యోతి, సరిత, ధనలక్ష్మి, పద్మ, నాగలక్ష్మీతో పాటు తదితరులు ఉన్నారు.



## వృద్ధాశ్రమంలో ఘనంగా జన్మదిన వేడుకలు

**కల్వకుర్తి, జనవరి 09, ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని పార్థసారథి మేనేజర్ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రొడ్యూసర్ డిస్ట్రిబ్యూటర్ శిరీష్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని వృద్ధాశ్రమంలో 50 కిలోల బియ్యాన్ని,అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి వృద్ధులతో కలిసి కేక్ కటింగ్ చేసి నిర్వహించారు.ఈసందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు బ్రదర్ శిరీష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా అనాథ ఆశ్రమంలో కేక్ కటింగ్ చేసి వృద్ధులకు 50 కిలోల బియ్యాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో అంజి, హరీష్, సాయి, చిత్తారి వెంకటేష్, గణేష్, శివ ఉన్నారు.



## ఈనెల 18వ తేదీ వరకు ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించాలి..

**వనపర్తి టౌన్,జనవరి 09 ప్రభాతవార్త:** అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1,3,5 సెమిస్టర్ పరీక్షలఫీజులు చెల్లించడానికి ఈనెల18 చివరితేదీ అని వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.శ్రీనివాస్ ఒ ప్రకటనలో తెలిపారు. డా.బీ.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2022-23సంవత్సరానికి సంబంధించి డిగ్రీ 1,3,5 సెమిస్టర్ చదువుతున్న విద్యా ర్థులకు పరీక్ష నోటిఫికేషన్ వెలువడిందని విద్యార్థులతో నిర్ణిత గడు వులోగా పరీక్ష ఫీజు చెల్లించాలనీ మొదటిసెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 11నుండి17వరకు 3వ సెమిస్టర్ పరీక్ష ఫిబ్రవరి 20నుండి 26వరకు అలాగే 5వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 27నుండి మార్చి 6వరకు పరీక్షలు ఉంటాయని మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5వరకు పరీక్షల సమయమని వారు వివరించారు.

# ఆపరేషన్ స్మైల్ పేరుతో ప్రజల్లో అవగాహన కల్పించాలి..

**బాల్య వివాహం అంటే బాలల వేదింపు.. జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్**

**వనపర్తి క్రైమ్,జనవరి09 ప్రభాతవార్త:**బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్ ఐఎక్స్ పేరుతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు జనవరి 1వ తేదీ నుండి నెల రోజుల పాటు ఆపరేషన్ స్మైల్ పేరుతో ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రతి ఒక్కరు ఇందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. అమ్మాయిలకు 18సంవత్సరాలు, అబ్బాయిలకు 21సంవత్సరాలు కంటే తక్కువగా వయస్సు కలిగి ఉన్న వారికి వివాహం చేసినట్లయితే అది చట్టరిత్యా నేరమని బాల్య వివాహ నిషేద చట్టం 2006, లైంగిక నేరాల నుండి బాలల రక్షణ చట్టం-2012 ద్వారా వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు 10 సంవత్సరాల జైలు శిక్షకు అర్హులు అవుతారని రూ.1లక్ష జరిమానా విధించబడవచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని పుష్పలత మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 7శాఖలు సమన్వయంతో ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్, పోలీస్, రెవెన్యూ శాఖ,



బాల్య వివాహం అంటే బాలల వేదింపు గోడపత్రికను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, జిల్లా అధికారులు

చైల్డ్ లైన్, సీడీపీఓ, బాలల సంరక్షణ అధికారి, సీడబ్ల్యూసీ, శాఖలు పని చేస్తున్నట్లు ఆమె సూచించారు. బాల్య వివాహాలు రద్దు చేసేందుకు అధికారులకు సమాచారం అందించడం, బాల్య వివాహాలలో పాల్గొనకుండా ఉండాలని పిల్లల్లో విద్య నైపుణ్యాలు వృద్ధి చేయడం, పిల్లల ద్వారా తల్లిదండ్రులకు సలహాలు అందించడం,బాల్య వివాహాలలో పాల్గొనకుండా ఉండాలని, పిల్లల్లో విద్య నైపుణ్యాలు వృద్ధి చేయడం, పిల్లల ద్వారా తల్లిండ్రులకు సలహాలు అందించడం ద్వారా అరికట్టే వచ్చునని ఆమె అన్నారు. బాల్య వివాహాలు చేసినట్లుయితే పిల్లల తల్లిదండ్రులకు, సంరక్షకులకు శిక్షకు అర్హులవుతారని వారితో పాటు వరుడు, పూజారి, మధ్యవర్తులు, పెళ్లి పెద్దలు బాల్య వివాహాలకు సహకరించరించిన, పాల్గొన్న వారందరు శిక్షకు అర్హులు అవుతారని ఆమె తెలిపారు. బాలలకు ఏదైన ఆపద వచ్చినప్పుడు టోల్ ఫ్రీ 1098 నెంబర్ కు మహిళలకు 181 హెల్ప్ లైన్ కు కాల్ చేసి తమ సమాచారం అందించాలని ఆమె సూచించారు. అనంతరం ఆపరేషన్ స్మైల్ బాల్య వివాహం అంటే బాలల వేధింపే గోడపత్రికను జిల్లా అధికారులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షమ అధికారిని పుష్పలత, సీడబ్ల్యూఓ అలివేలమ్మ, సీడీపీఓ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, జిల్లా అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా బహుజనులు ఏకం కావాలి..

**మల్రి,నాగం, కూచుకుళ్ల ఆధిపత్యం రాజకీయాలను పారద్రోలాలి: బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లికుమార్**

**బిజినేపల్లి,జనవరి 09 ప్రభాతవార్త :** పార్టీలకతీతంగా బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ కోరారు. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని శాయిన్‌పల్లి బ్రిడ్జివద్దగల మార్కండేయ రిజర్వాయర్ శిలాఫలకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి కుమార్ మాట్లాడుతూ మార్కండేయ రిజర్వాయర్ వచ్చుడో మరి చచ్చుడో అనే నినాదం 2018 ఎన్నికల్లో ఇచ్చి, ఆ ఎన్నికల్లో గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. 2018 నుండి తట్టెడు మట్టి తీయకున్నా, మళ్లీ 2022వ సంవత్సరంలో కెటిఆర్‌ను తీసుకుని వచ్చి శిలాఫలకం ఆవిష్కరించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. రైతులకు సరైన నష్టపరిహారం ఇచ్చి, రిజర్వాయర్ కడితే బీఎస్పీ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. అట్లాగే ఆధిపత్య పాలక పార్టీల నాయకులైన నాగం జనార్ధన్‌రెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మల్రి జనార్ధన్‌రెడ్డి కుట్రల్లో బహుజనులు బలి కావొద్దని పిలుపునిచ్చారు. రిజర్వాయర్ సమస్యను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల వరకు దిగజార్చవద్దని దుయ్యబట్టారు. వీరిలో ఎవరు ఎమ్మెల్యేగా ఉన్న దెబ్బలు మాత్రం బహుజనుల వీపులపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో బహుజనులు అంతా ఏకమై బహుజన రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. జిల్లా ఇంఛార్జి అంతటి నాగన్న మాట్లాడుతూ బహుజనులు పాలకులు అయితే తప్ప,బహుజనులపై దాడులు ఆగవని అన్నారు. అలాగే బీఎస్పీ అసెంబ్లీ ఇంచార్జి బోనాసి రాంచంద్రం మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు అధికారం ఉందని,ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బహుజనులపై దాడిచేస్తే పార్టీలకతీతంగా స్పందిస్తామని తెలిపారు. తదనంతరం శాయిన్‌పల్లి తండాకు వెళ్లి వాల్యానాయక్‌ను పరామర్శించారు. వాల్యానాయక్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. వాల్యానాయక్ కుటుంబానికి బీఎస్పీ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. వాల్యానాయక్‌పై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాల్యానాయక్ ఇంటి దగ్గర పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించి, వాల్యానాయక్ కుటుంబానికి అన్ని రకాల తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులు పరశురామ్, కోశాధికారి ఆనంద్, బీఎస్పీ మండల అధ్యక్షులు రాంచందర్, ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, బిఎస్పీ మండల నాయకులు మల్లేష్, లక్ష్మణ్, బీఎస్పీ రాజ్, రాములు, శ్రీనివాసులు, నాగేష్, శ్రీహరి, ఆంజనేయులు, అనిల్, శివ, రామకృష్ణ, వెంకటేష్, బహుజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, బహుజన మేస్త్రీ సంఘం జిల్లా అధ్యక్షులు డి.రాముడు, బివిఎఫ్ మండల కన్వీనర్ వెంకటేష్‌లు పాల్గొన్నారు.



మార్కండేయ రిజర్వాయర్ పైలాన్ వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్

## ఏటీఆర్ ఉన్నత పాఠశాల క్యాలెండర్ ఆవిష్కరణ

**మహ్మదాబాద్,జనవరి 09 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రౌన్ గార్డెన్‌లో సోమవారం రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా ఏటీఆర్ ఉన్నత పాఠశాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రైవేట్ పాఠశాలలకు అండగా ఉంటానని అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల విద్యాభివృద్ధికి పాటుపడాలని మహబూబ్‌నగర్ జిల్లా ఖ్యాతిని నలుమూలల వ్యాపింపజేయాలని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా పబ్లిక్ పాఠశాల జిల్లా అధ్యక్షులు ఎన్. ప్రభాకర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కోరమోని నరసింహులు, బిసి మేధావుల సంఘం అధ్యక్షులు పాండురంగం, బిసి మేధావుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రముఖ కంటి వైద్యులు రమేష్ సరోడే, ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్ర, జి.ఎటిఆర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ అంజిరెడ్డి, ట్రస్మా పట్టణ అధ్యక్షురాలు మాధవి, కోశాధికారి రూపవతి, ట్రస్మా సభ్యులు మల్లికార్జున్, అక్తర్‌బేగం, అతహర్,సాహెబ్ హుస్సేన్, జిజి రాణి, హరినాథ్‌గౌడ్, సురేందర్‌గౌడ్ మహమూద్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన నెట్టెంపాడు గోవిందు**

**ధరూర్,జనవరి 09 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నెట్టెంపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 270 మంది విద్యార్థులకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి గ్రామ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామ కమిటీ నాయకులతో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల విద్యాభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి గ్రామ కమిటి నాయకుల సహకారంతో పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేయడం జరిగిందని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచిగా చదివి జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి అండగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి ధరూర్ మండల ప్రధాన కార్యదర్శి రాము, గ్రామ గౌరవాధ్యక్షులు ఎల్లప్ప, అధ్యక్షులు గుడిసె శివన్న, కోశాధికారి రాము, నాగేష్, నాయకులు మహాలింగప్ప, శివన్న, గోపాల్, ప్యాట్ల రాములు, లక్ష్మణ్, మల్లేష్, సూరి, దేవన్న, వెంకటన్న, చిన్నా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

## పట్టుబడిన ఇసుకను ప్రభుత్వ పనులకు పంపిణీ

**ఇటిక్యాల,జనవరి 09 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో గతనెల డిసెంబర్ 31వ తేదీన అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుకను సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు 8 టిప్పర్లకు పైగా ఇసుకను పట్టుకుని సీజ్‌చేసి పెట్రోల్ బంక్ సమీపంలో ఇసుకను డంపు చేశారు. పట్టుబడిన ఇసుకను ఎవరు తరలించకుండా ఉండేందుకు వీఆర్ఎలను కాపలా ఉంచారు. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ ఆదేశాల మేరకు సోమవారం తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ అజిత్‌ల ఆధ్వర్యంలో పై అధికారుల అనుమతితో క్యాతూర్ గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ పనులైన మన ఊరు మనబడి పాఠశాల పనులకు 6 టిప్పర్ల ఇసుకను పంపించారు. మిగిలిపోయిన ఇసుకను జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పనులకు, అనుమతి వస్తే ఇసుకను తరలించడం జరుగుతుందని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ అజిత్ తెలిపారు.



సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్న రెవెన్యూ అధికారులు

## ఈనెల 14,15వ తేదీలలో తిరుమలగిరి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

**తిరుమలగిరి ఆంజనేయస్వామి ఆలయ కమిటి నూతన చైర్మన్‌గా జగన్‌నాయక్**

**భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపు**

**రాజాపూర్,జనవరి 09 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామ ఆంజనేయస్వామి ఆలయ కమిటి నూతన చైర్మన్‌గా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేనావత్ జగన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన కార్యవర్గం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, దేవాలయ కమిటి చైర్మన్‌గా నేనావత్ జగన్ నాయక్, గౌరవాధ్యక్షులుగా రాంజీ నాయక్, హన్మంతు నాయక్, రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి చందర్, కోశాధికారి చంద్రప్ప తదితరులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవి, వైస్ ప్రెసిడెంట్ రవినాయక్, సహాయ కార్యదర్శిగా తిరుమలయ్య, కార్యవర్గ సభ్యులుగా లింగం, సేవాలాల్, బిచ్యానాయక్, నర్సింగ్, బాల్య,సోమ్లా, చందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా నూతన ఆలయ నూతన చైర్మన్ జగన్‌నాయక్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా తిరుమలగిరి గ్రామంలో ఈనెల 14,15వ తేదీలలో ఆంజనే యస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. బాలానగర్ మండల ప్రజలతోపాటు జడ్చర్ల నియో జకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిరుమలగిరి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని జగన్ నాయక్ విజ్ఞప్తి చేశారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన ఆలయ కమిటి

## విదేశీ విద్య ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం..

**వనపర్తి టౌన్,జనవరి 09 ప్రభాతవార్త:** విదేశీ విద్యాలయాలలో పీజీ/డాక్టరేట్ వంటి ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే మైనార్టీ విద్యార్థులకు ఓపెన్ స్కాలర్‌షిపఖ పథకం కింద ఉపకార వేతనానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కాళి కాంతి తెలిపారు. ఆగస్టు 01/2022 నుండి 31 డిసెంబర్ 2022 మధ్యకాలంలో విదేశీ యూనివర్సిటీ నందు ప్రవేశం పొంది ఉన్న అభ్యార్థులు అర్హులని, వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తెలంగాణ ఇపాస్.సీజీజీ.గవర్నమెంట్.ఇన్ లో దరఖాస్తులు చేసుకోని హార్డ్ కాపీలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం నందు సమర్పించాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 23 సాయంత్రం 5గంటలకు చివరి తేదీ తెలిపారు. హార్డ్‌కాపీలను జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించడానికి చివరి తేదీ 31/01/2023 అని సూచించారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి

**వెల్దండ, జనవరి 09, ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని కంటోనిపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు కంటోనిపల్లి గ్రామస్తులు శివప్రసాద్, శ్రావణ్‌కుమార్‌లు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్తిం గ్ సమస్య ఉండటం వల్ల ఎలక్ట్రికల్ వస్తువులకు తగిలినప్పుడు వి ద్యుత్ షాక్‌కు గురవుతున్నామనే విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రణీత్, వెంకటేష్, వంశీ తదితరులు ఉన్నారు.



## ఈ నెల 11న ముదిరాజ్ మండల కమిటీ ఎన్నిక

**వెల్దండ, జనవరి 09, ప్రభాతవార్త:**ఈ నెల 11న వెల్దండ మండల ముదిరాజ్ మండల కమిటీ ఉంటుందని ముదిరాజ్ సంఘం నాయ కులు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ వీరబ్రహేంద్రస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజ్ సోదరులు తప్పకుండా హాజరై ముదిరాజ్ మండల కమిటీ ఎన్నికకు సహకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో బాలరాజు, శ్రీను, రమేష్, దేవేందర్, మల్లేష్, కొండల్, శేఖర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**కెటిదొడ్డి,జనవరి09 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో నేడు జరిగే కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని కార్యకర్తలకు గ్రామ కమిటీలు, మండల కమిటీల గురించి వివరించనున్నట్లు తాలూకా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, కెటిదొడ్డి మండల ఇంఛార్జి రాజేంద్ర (దినేష్) తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జనవరి 26 హాథ్‌సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం (చేయితో చేయి కలిపి ప్రతి గపడకువెళ్లి చెప్పాలి) అనే కార్యక్రమం ముందుకు తీసుకుపోవాలని కార్యకర్తలకు తెలియజేయనున్నట్లు అన్నారు.కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

## దళారుల జోక్యం లేకుండానే పథకాల అమలు..

మొదటి పేజీ తరువాయి భాగం..

అనుమతించినట్లు వెల్లడించారు. దళారుల ప్రమేయం లేకుండా జీవో నెంబర్ 58కింద రెగ్యులరైజ్ అయిన వారికి ఇంటి స్థలాలు అందజేయాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గిరిజన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి,డీసీసీబీ చైర్మన్ నిజాంపాషా,కలెక్టర్ ఎస్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ కమిషనర్లు నర్సింహులు,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వ్యక్తులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతి

మొదటి పేజీ తరువాయి భాగం..

బిజినపల్లి మండల నాయకులపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సోమవారం టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి వర్యులు నాగం జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లురవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లతో కలిసి డీజీపీకి వినతి పత్రం అందించారు.

## ఆర్ఎంపి డాక్టర్ల క్యాలెండర్ ఆవిష్కరణ

**గండీడ్,జనవరి 09 ప్రభాతవార్త :** జిల్లా గ్రామీణ వైద్య సేవకుల సంఘం గండీడ్ మండల క్యాలెండర్ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్ఎంపి మిత్రులు ఐకమత్యంతో ఉంటూ వైద్య విజ్ఞానాన్ని పెంపొందించుకుని ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తయార్‌పాషా, వి కేర్ ఆసుపత్రి ఆంజనేయులు, గండీడ్ మండల అధ్యక్షులు సంగమేశ్వర్, ఆంజనేయులు, అధ్యక్షులు హరిచంద్రప్రసాద్, శ్రీనివాసులు, మండల కార్యవర్గ సభ్యులు, ఆర్ఎంపి మిత్రులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

◆ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్య చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**అమరచింత, జనవరి 9 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని 4,5వ వార్డులలో రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మక్తల్, అమరచింత, ఆత్మకూరు మున్సిపాలిటీల అభివృద్ధి పై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు, కులమతాలకు అతీతంగా అభివృద్ధి ఫలాలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వమని, వివిధ జనాకర్షక పథకాలతో ప్రతి ఒక్కరి జీవనానికి భరోసా ను కల్పించే పాలనతో కేసీఆర్ పాలన సాగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్, తహసిల్దార్ షేక్‌చాంద్ పాష, మార్కెట్ చైర్మెన్ ఎస్.ఎరాజు, టీఆర్‌ఎస్ మండల పట్టణ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, నరసింహులు గౌడ్, కౌన్సిలర్లు రాజ్ కుమార్, లక్ష్మీ వెంకటేష్‌చ సింధు, విజయ్, కోఆప్షన్ సభ్యులు ఏపీ రాజేందర్, శనవాజ్‌ఖాన్, షాహిన్ రఫీ, కమీషనర్ మహ్మద్ ఖాజా, ఏఈ ధర్మరాజు, నందిమల్ల వెంకటేశ్, బాలరాజు మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కర్యాకర్తలు పాల్గొన్నారు.

# భారత్ జోడోయాత్ర ఆశయాలను ప్రతి ఇంటికి చేరవేస్తాం

◆ ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి



మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న డా.చిన్నారెడ్డి

**శ్రీరంగాపురం, జనవరి9 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీరంగ నాయక స్వామి దేవాలయం ఆవరణలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు రాములు యాదవ్ అధ్యక్షత వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ కార్యదర్శి డా.జి.చిన్నారెడ్డి పాల్గొని ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో ఎవరు చేయలేని సాహసం కాంగ్రెస్ పార్టీ అధినేత, మెంబర్ ఆఫ్ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో దేశంలో ప్రేమను ఐక్యతను చాటారని తెలిపారు. దేశాన్ని విడగొట్టడం కోసం కొంతమంది ప్రయత్నం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఏకం చేయడానికి కృషి చేస్తుందని దేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతా కలిసికట్టుగా ఐక్యతతో ముందుకు సాగాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యాదయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దివాకర్ యాదవ్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు రోహిత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, ఎంపీటీసీ ఎల్లస్వామి మండలయువజన అధ్యక్షులు గంగాధర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెంటపల్లి గ్రామాన్ని సందర్శించిన ఎంపీఓ



**వనపర్తి రూరల్, జనవరి 9 ప్రభాతవార్త:** వనపర్తి మండలంలోని మెంటపల్లి గ్రామంలో ఎంపీఓ సుదర్శన్ సందర్శించారు. నర్సరీలో మొక్కలు సరిగ్గా పెరగలేదని అన్నారు. పంచాయితీ సెక్రెటరీలకు తగు సూచనలు చేశారు. స్కూల్ పరిసరాలు శెగ్రిగేషన్ షెడ్ పరిశీలించారు. పన్నుల వసూళ్ల పరిశీలించగా 35% వసూలు చేయబడింది. జనవరి చివరివరకు 100% వసూలు చేయాలని సెక్రటరీ ని ఆదేశించారు.

## నాగరాల గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలి



**శ్రీరంగాపురం, జనవరి 9 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీరంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో భాగంగా మండల పరిధిలోని నాగరాల గ్రామం ఆర్ అండ్ ఆర్‌లో భాగంగా గ్రామం అంత ముంపునకు గురి కావడం జరిగింది. ఇందులో ఈ గ్రామం కొత్తగా 3సెంటర్ లు గా ఏర్పాటు కావడం జరిగింది. 3వ సెంటర్ లను కూడా వేర్వేరుగా నూతన గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయాలని తహసిల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్ రెడ్డి కి వినతిపత్రం ఇవ్వం జరిగింది. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శ్రీధర్, శివనారాయణ, ఆంజనేయులు, ఆనంద్, మహేష్, చందు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సమరశంఖారావానికి హాజరైన దేవరకద్ర నేతలు

**దేవరకద్ర, జనవరి 9 ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లో సోమవారం జరి గిన సర్పంచ్‌ల సమరశంఖరావా నికి దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ పంచాయతీ విభాగం అధ్వ ర్యంలో హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సర్పంచుల నిధులు, విధులు, సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ సమర శంఖారావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలసి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూధన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్రప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు.

## కొండ ప్రశాంత్‌రెడ్డికి ఘనసన్మానం

**దేవరకద్ర, జనవరి 9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో దేవరకద్రకు చెందిన, దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండ ప్రశాంత్‌రెడ్డి(కేపీఆర్)ను ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్‌లోని ఆశోక్‌టాకీసు వద్ద ఏర్పాటు చేసిన నూతన రక్షిత ఉడిపి హోటల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతథిగా హాజరైన కొండ ప్రశాంత్‌రెడ్డికి ఈ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాంలక్ష్మణ్, హోటల్ యజమాని గౌలి అనిల్, నరేందర్‌గూడ్, లల్లునాని, కేపీఆర్ యూత్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

● ఎపిఎం విజయకుమారి

**కోయిల్‌కొండ, జనవరి 9 ప్రభాతవార్త :** మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని మండల ఐకెపి ఎపిఎం విజయ కుమారి మహిళా సంఘాలకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐకెపి ఎపిఎం విజయ్‌కుమారి మాట్లాడుతూ గ్రామ సంఘాలు స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు, బ్యాంకుద్వారా తీసుకున్న రుణాలు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే వసూలు చేసే బాధ్యతను సంఘాల అధ్యక్షులు తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ సంఘాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఐకెపి సిసిలు మల్లేష్, కేశవులు, బద్రినాయక్, మహిళా సంఘం అధ్యక్షురాలు తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో దారుణం

● కన్న కొడుకును హతమార్చిన తండ్రి ● ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 9, ప్రభాతవార్త:** తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. కన్నతండ్రే కొడుకుని హతమార్చిన సంఘటన సోమవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాగుడుకు బానిసైన కొడుకు చేష్టలతో విసుగెత్తిన తండ్రి ఈ దారుణానికి ఒడిగట్టాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామానికి చెందిన నరసింహరెడ్డి విమలమ్మ దంపతులకు ముగ్గురు మగ సంతానం. పెద్ద కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి (38) తాగుడకు బానిసై నిత్యం తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. శ్రీకాంత్ రెడ్డి రోజు మాదిరిగానే పీకల వరకు తాగి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. ఈ పెనుగులాటలో శ్రీకాంత్‌రెడ్డి క్రింద పడటంతో తండ్రి కోపంతో రాయితో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు పక్కనే ఉన్న వరి గడ్డి తీసుకొచ్చి మృతదేహంపై వేసి కిరొసిన్, పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం పూర్తిగా మంటల్లో కాలిపోయింది. విషయం కాస్త బయటకు పోక్కడంతో మిగతా కుటుంబ సభ్యులు నరసింహరెడ్డి విమలమ్మలను నిలదీశారు. శ్రీకాంత్‌రెడ్డి సోదరుడు రవీందర్‌రెడ్డి సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగంకర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)



మంటల్లో పూర్తిగా కాలిపోయిన శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం

# క్షేత్రస్థాయిలో తొలిమెట్టును అమలుపరచాలి

● విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించాలి: జె.డి వెంకటనరసమ్మ



విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలిస్తున్న జెడి వెంకట నరసమ్మ

**ఖిల్లాఘణపురం, జనవరి 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉప్పరిపల్లి , సోళీపూర్, షాపూర్ మోడల్ స్కూల్ జల్లాఘణపురం పాఠశాలను సోమవారం జె.డి వెంకటనరసమ్మ సందర్శించారు. ఆయా పాఠశాలలోని విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో క్షేత్రస్థాయిలో తొలిమెట్టు కార్యక్రమాలను అమలుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. తొలిమెట్టు పాఠశాలలో నిర్వహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని సూచించారు. విద్యార్థులకు కనీసం చదవడం, రాయడంతో పాటు గణితం భాష విభాగాల్లో ప్రతిభ చాటేలా చర్యలు ఉండాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యతవంతమైన విలువలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండి క్రమశిక్షణ అలవాటు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని బాధ్యత ఉపాధ్యాయులతే అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ పౌష్టికాహారాన్ని అందజేయాలని అన్నారు. మన ఊరుఎ మనబడి కార్యక్రమంలో షాపూర్ మండల కేంద్రంలోని పాఠశాలల్లో చేస్తున్న పాఠశాలల్లో చేస్తున్న పనుల ప్రగతిని పరిశీలించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో మిగిలిపోయిన పనులను వేగవంతం గా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అబ్దుల్ అజీమ్ బాష, జిల్లా సెక్టోరియల్ అధికారి యుగేంధర్, సీఆర్‌పీ లు రాములు, వెంకటేష్, పార్వతమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# 2వ విడత క్షయవ్యాధి పోషకాహార కిట్ల పంపిణీ



క్షయవ్యాధి గ్రస్తులకు పోషకాహార కిట్లను అందిస్తున్న వైద్యధికారి డా.రవిశంకర్

**మదనాపురం, జనవరి 9 ప్రభాతవార్త:** మదనాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రవిశంకర్ సందర్శించి మండల పరిధిలోని 15మంది క్షయ వ్యాధి గ్రస్తులకు 2వ విడుత పోషకాహార కిట్లను అందజేయడం జరిగింది. క్షయవ్యాది గ్రస్తులకు క్రమం తప్పకుండా మందులతో పాటు మంచి బలమైన ఆహారాన్ని తీసుకోవాలని ఆమన సూచించారు. ఈ నెల 18వ తేదీ నుండి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమం పై శిక్షణ కార్యక్రమాన్ని డా.రవిశంకర్, డా.భవాని వైద్యాధికారి డా.మమత, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్రగౌడ్, ఆప్తామెట్రిక్స్ బాలరాజు, సావిత్రి, ఆశకార్యకర్తలు కంటి వెలుగులలో నిర్వహించే బాధ్యతలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈనెల 18వ తేదీన మండల పరిధిలోని శంకరపేట, కొత్త పల్లి గ్రామాల్లో కంటి వెలుగు ప్రోగ్రాం ప్రారంభించడం జరుగుతుంది. 18 సంవత్సరాలు పైబడిన వాళ్లందరు కూడా కంటి పరీక్షలు చేయించుకోని తగిన మందులు, అద్దాలు ఉచితంగా పొందాలని ఆయన సూచించారు.

# మర్రికుంట ప్లాట్ల బాధితులను ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్



మర్రికుంటలోని ప్లాట్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**వనపర్తి టౌన్, జనవరి 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంటను రాష్ట్ర ప్రభుత్వం మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంలో భాగంగా మర్రికుంట కింద భాగంలో ఉన్న ప్లాట్లు పోవడం జరుగుతుందని తెలిసి సీపీఎం జిల్లా బృందం బాదితులను, ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ మర్రికుంట లోని సర్వేనెంబర్ 110.6-20 గుంటల సికం భూమి ఉంది, 171,172,174 సర్వే నెంబర్ లలో 17 ఎకరాలపైగా పట్టా భూముల్లో ప్లాట్లు వేయడం ద్వారా నిరుపేద రైతులు మధ్యతరగతి కుటుంబాలు వందలాది ప్లాట్లు తీసుకోవడం జరిగింది. ఇప్పుడు మర్రికుంట పున:నిర్మాణంలో భాగంగా ఆ ప్లాట్లు పోతుండడం వల్ల కోట్ల రూపాయలు బాదితులు నష్టపోవడం జరుగుతుంది, కాబట్టి కలెక్టర్, మంత్రి స్పందించి బాదితులతో మాట్లాడి వారికి సరైన న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, సీపీఎం నాయకులు రమేష్, జి.వెంకటయ్య, కాశన్న బాదితులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాసంఘం మహాసభ గోడపత్రిక విడుదల



కోయిల్‌సాగర్‌లో మహాసభ గోడపత్రికను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

**దేవరకద్ర, జనవరి 9 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్‌లో సోమవారం తెలంగాణరాష్ట్ర ఉపాధ్యాసంఘం (టీఎస్‌యుటీఎఫ్)మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. ఈ నెల 13,14 తేదీలలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో తెలంగాణరాష్ట్ర ఉపాధ్యాసంఘం రాష్ట్ర 5వ మహాసభలు జరుగనున్నాయి. దీంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇట్టి మహాసభ గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణరాష్ట్ర ఉపాధ్యాసంఘం జిల్లా కోశాధికారి భాస్కర్, దేవరకద్ర మండల ప్రధానకార్యదర్శి కృష్ణ ప్రసంగించారు. ఉపాధ్యాయరంగం ఎదుర్కోంటున్న సమస్యల పరిష్కారానికై, అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ పట్ల అనుసరిస్తున్న పెడధోరణలకు వ్యతిరేకంగా ఈ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి వేలాదిమంది ఉపాధ్యాయులతో ఈ బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్‌టిఎఫ్‌ఐ ఆలిండియా ఉపాధ్యాయ సంఘం నాయకులు కూడ ఈ మహాసభలకు హాజరవుతారన్నారు. కావున దేవరకద్ర మండలంలోని ఉపాధ్యాయులు కూడ అధికసంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, అంజనేయులు పాల్గొన్నారు.

# దళితబంధు పథకం నిరుపేదలైన దళితులకే ఇవ్వాలి



కలెకటర్ కార్యలయం ఎదుట నిరసన చేస్తున్న బీఎస్పీ నాయకులు

**వనపర్తి టౌన్, జనవరి 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని గణపురం మండలం తిర్మలాయపల్లి, గోపాల్‌పేట మండలం ఏదుల గ్రామాలనఉ చెందిన దళితులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అర్హులైన నిరుపేద దళితులకు దళితబంధు పథకం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ భాష కి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో కేవలం 100 యూనిట్లు మాత్రమే జిల్లాకు మంజూరు అయ్యాయని తెలిపారు. రెండవ విడత 500యూనిట్లు మళ్లీ వస్తాయని అన్నారు. ఈనెల 14వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. లబ్దిదారులు మాట్లాడుతూ రాజకీయ నాయకులు వారి అనుయాయులను మాత్రమే ఎంపిక చేశామని చెప్తున్నారని వాపోయారుజ అనంతరం జరిగిన సమావేశంలో బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ మాట్లాడుతూ దళితబంధు పథకం నిరుపేతలైన దళితులకే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులనే ఈ పథకానికి ఎంపిక చేయాలనుకుంటే బీఆర్‌ఎస్ బంధు లా మారిందని ఎద్దేవ చేశారు. ఇలా పక్షపాత వైఖరి అవలంభిస్తే అధికార పార్టీకి దళితులు గుణపాఠం చెప్తారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వా విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద దళితుల కోసం ఉద్యమం చేస్తామని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. న్యాయంగా నిరుపేదలైన భూమిలేని దళితులకు దళితబంధు పథకం వర్తింపజేసి పారదర్శకంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి మొల్గర తిరుమలేష్, మొల్గర రమేష్, మంజుల రమేష్ తో పాటు 50మంది రెండు గ్రమాలకు చెందిన దళితులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని పాదయాత్ర



ఆనంద్‌కు స్వాగతం పలుకుతున్న మండల బీఆర్‌ఎస్ నాయకులు

**కొత్తకోట, జనవరి 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని ఇటిక్యాల మండలం వేముల గ్రామానికి చెందిన ఆనంద్ పాదయాత్ర చేస్తున్నాడు. సోమవారం కొత్తకోటకు చేరుకున్న సందర్భంగా ఆనంద్ కు సీడీసీచైర్మెన్ చెన్నకేశవ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, కౌన్సిలర్ పద్మ అయ్యన్న, కోఆప్షన్ సభ్యులు సుజాత శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. ఆనంద్ ఆదివారం జోగులాంబ జిల్లా ఇటిక్యాల మండలం వేముల గ్రామం నుండి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ యాత్ర ప్రగతి భవన్ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమంతు యాదవ్, సాయిలు, కురుమన్న, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## ఇరుముడి కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్



**వనపర్తి టౌన్, జనవరి 9 ప్రభాతవార్త:** రాజనగరం రోడ్డు అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప సేవ సమితి ఉపాధ్యక్షులు, సోషల్‌మీడియా కన్వీనర్ జనంపల్లి బీచుపల్లి యాదవ్ ఇరుముడి కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్ పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి దర్శనం చేసుకొని అయ్యప్ప స్వామి ఆశీర్వాతం పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ముత్తు కృష్ణ, గురుస్వామి ఢిల్లీ రాము, రామస్వామి, కెవీఆర్ గురుస్వామి, కౌన్సిలర్ నక్క రాములు యాదవ్, నక్క మహేష్ యాదవ్, గోకుల్, బేకరీ మన్యం పాల్గొన్నారు.

## సగర యువజన సంఘం కమిటీ ఏర్పాటు





సగర యువజన సంఘం అధ్యక్షులు పి.సురేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి పి.వినోద్ కుమార్

**కొత్తకోట, జనవరి 9 ప్రభాతవార్త:** సగర యువజన సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.సురేష్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా పి.వినోద్‌సాగర్, కోశాధికారి చీర్ల కురుమూర్తి, ఉపా ధ్యక్షులు నరేందర్, రాజు సాగర్, రమేష్, సహాయ కార్యదర్శులు విజయ్‌కుమార్, చీర్లరాజు, కృష్ణయ్య, యాదయ్యసాగర్, గౌరవ అధ్యక్షులుగా విజభాస్కర్, గౌరవ సలహాదారులుగాఎ.శ్రీనివాసులు, చంద్రశేఖర్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

**కొత్తకోట, జనవరి 9 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణానికి చెందిన మున్సిపల్ కార్మికుడు జనంపల్లి శ్యామ్‌సుందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు రూ.13500 ఆర్థిక సహాయం అందజేశారు. మున్సిపాలిటీ తరుపున అంత్యక్రియల నిమిత్తం రూ.25వేలు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుకేశిని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితో పాటె జెఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో జడ్పీ వైస్ ఛైర్మెన్ వామన్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, కౌన్సిలర్ పద్మఅయ్యన్న లు ఉన్నారు.

## విద్యార్థులకు మాదిరి ఎన్నికలు

**మహ్మదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త :** మండలంలోని నంచర్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలను ప్రజాస్వామ్య బద్దంగా విద్యార్థులకు అవగాహన ఏర్పడే విధంగా 10వ తరగతి విద్యార్థులను సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా ఎన్నికల సిబ్బంది, పోలీసులుగా ఎన్నికలకు సంబంధించిన సిబ్బందిని విద్యార్థులను అందరిని నియమించి ఎన్నికలను ఏ విధంగా నిర్వహిస్తారో ఏవిధంగా ఓటు వేయాలో విద్యార్థులకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా నిర్వహించారు. వీరంలో సర్పంచ్ అభ్యర్థులుగా గణేష్, సాయికృష్ణ, మానసలు వ్యవహరించారు. ఐదు వార్డులకు 15 మందిని వార్డు మెంబర్లను నిలబెట్టడం జరిగింది. 1వ వార్డు నుండి అంజి, 2వ వార్డు నుండి సుహాని, 3వ వార్డు నుండి అక్షయ, 4వ వార్డు నుండి శిరీష, 5వవార్డు నుండి అస్లాంలు గెలుపొందారు. సర్పంచ్‌గాఎన్.గణేష్ అనే విద్యార్థి గెలుపొందాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ కుమార్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యా యులు మల్లారెడ్డి, షబానా, ఇతర ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఉపాధ్యా యుల మాటల్లో ఓటు అనేది కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే బేధం లేకుండా18సంవత్సరాలు నిండిన పౌరులకు భారత రాజ్యాంగ ఆర్టికల్ 326 ద్వారా ఓటుహక్కు మనకు కల్పించిందని వారి మాటల్లో చెప్పారు.



# సర్వేంద్రియానం..నయనం ప్రధానం

మొదటి పేజీ తరువాయి భాగం...



సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని మంతటి క్రాస్‌రోడ్డు తేజ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన 2విడత కంటి వెలుగు కార్య క్రమం అవగాహన సదస్సుకు రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరం జన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు,ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియానం... నయనం ప్రధానం అనే నానుడి మాటలను ఊటంకిస్తూ తెలంగాణలో ప్రజల అందత్వాన్ని గుర్తించి నివారించానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తుందన్నారు. లోకాన్ని చూడటానికి, అర్థం చేసుకోవడానికి అత్యంత ప్రధానం దృష్టి అని, అంధత్వ నివారించడానికే కంటి వెలుగు కార్యక్ర మం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరు కంటి చూపు సమస్యతో బాధపడకూడదనే ఉద్దే శ్యంతో సీఎం కేసీఆర్ అన్ని ముందస్తు ప్రణాళికలు చేసుకొని జనవరి 18 నుంచి జూన్ 30వ తేదీ వరకు 100 పని రోజుల్లో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు సూక్ష్మ ప్రణాళిక తయారు చేయాలన్నారు.ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు తెలంగాణ సమాజ నిర్మాణవుతున్నదని, రాబోయే కాలంలో ప్రపంచ ఆరోగ్య సూచీలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలువనందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోజు ఏ టీం, ఏ వార్డులో లేదా ఏ గ్రామ పంచాయతీలో ఎక్కడ కంటి పరీక్షలు నిర్వహిస్తారో, ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ముందుగా రూపొం దించుకున్న ప్రణాళిక ప్రకారం మాత్రమేకార్యక్రమం నిర్వహించాలని సూచించారు.గత కంటి వెలుగు కార్యక్రమం లో 1.54 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 50 లక్షల మందికి కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సారి సైతం దాదాపు అంతే స్థాయిలో కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు ఉచితంగా ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 30 లక్షల దగ్గర చూపు అద్దాలు జిల్లాలకు పంపించామన్నారు. 2023 జనవరి 18 నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమం వారంలో 5 రోజులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9గంటలకు ప్రారంభమై సాయంత్రం 4గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 97,483 జనాభా ప్రతిపాదికన 100 రోజుల్లో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు 50 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 547 గ్రామ పంచాయతీ, మున్సిపాలిటిల్లోని వార్డుల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు దప్పు సాటింపు వేయించాలన్నారు.జిల్లాకు కావాల్సిన 73,596 దగ్గరచూపుకు కావాల్సిన రీడింగ్ గ్లాసెస్‌లు రానున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. 100శాతం కంటి పరీక్షలు నిర్వహించి రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, అదనపు కలెక్టర్ మనుచౌదరి, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలి

● వనపర్తి జిల్లా ఎస్పీ అపూర్వరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అపూర్వరావు

**వనపర్తి క్రైమ్,జనవరి 9 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల తో ఎస్పీ అపూర్వరావు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని సంబందిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూఫిర్యాదులు 10, భార్యభర్తలు 02, పరస్పర గొడవల 03 ఫిర్యాదులు మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలిపారు.

## గార్లపాడును మండలంగా ప్రకటించాలి



**కోయిల్‌కొండ,జనవరి 9 ప్రభాతవార్త:** మండలంలోని గార్లపాడును మండల కేంద్రంగా ప్రకటించాలని మండల సాధన సమితి నేతలు రామునాయక్, వెంకట్రాంరెడ్డి, నవీన్, శ్రీహరిగౌడ్, దస్తగిరి తదితర నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గార్లపాడును మండలంగా ప్రకటించేందుకు అన్ని అర్హతలు కలిగి ఉందని కలెక్టర్‌కు విన్నవించడం జరిగిందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ మీరిచ్చిన వినతి పత్రాన్ని నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపిస్తానని కలెక్టర్ తెలిపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల సాధన సమితి నేతలు మల్లికార్జున్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేవరకద్రకు ఎమ్మెల్యే ఆల రాక

-ఎంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్



ఎంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్

**దేవరకద్ర,జనవరి 9 ప్రభాతవార్త:** దేవరకద్రలో మంగళవారం జరుగు కంటి వెలుగు అవగాహన సదస్సు కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతు న్నట్లు యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ తెలి పారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యల యంలో అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ముఖ్య మంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న సందర్భంగా ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి దేవర కద్ర మండలానికి సంబందించిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడ ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు. కావున పార్టీ నాయకులు,కార్యకర్తలు,అనుబంద సంఘాల నాయకులు,ఆల యువ సేన నాయకులు,అన్ని విభాగాల నాయకులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు.

## నేడు టీయూడబ్ల్యూజే (ఐజేయు) పట్టణ జర్నలిస్టుల సమావేశం



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పట్టణ ప్రధాన కార్యదర్శి డి.మణ్యం

**వనపర్తి టౌన్,జనవరి9 ప్రభాతవార్త:** టీయూడబ్ల్యూజే (ఐజేయు) వనపర్తి పట్టణ, మండల జర్నలిస్టు యూనియన్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రధాన కార్యదర్శి డి.మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం వనపర్తి జిల్లా పరిషత్ హాల్‌లో జరగనుందని యూని యన్ వనపర్తి పట్టణ అధ్యక్షులు బి.లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ముఖ్య సమావేశానికి జిల్లా అధ్యక్షులు గుండ్రాతి మధుగౌడ్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొండన్న యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు నోముల రవీందర్ రెడ్డి, కొంతం ప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొలమోని రమేష్, సీనియర్ పాత్రికేయులు మల్యాలబాలస్వామి,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నవీన్ గౌడ్,ప్రధాన కార్యదర్శి శివకుమార్, సీనియర్ పాత్రికేయులుపొలిశెట్టి బాలకృష్ణ, పొర్లరెడ్డి, ఊశన్న, శ్రీనివాసరావు, కృష్ణయ్య, బాషపాగ రాజు, జిల్లా అదనపు కార్యదర్శి పికిలి రాము, వివిధ పత్రికల ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫర్లు జిల్లా ఫోటో జర్నలిస్టులు పాల్గొంటారు. వనపర్తి పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అందరు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## కృష్ణవేణి కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



డీఎస్పీకి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**గద్వాల టౌన్,జనవరి 9 ప్రభాతవార్త:** గద్వాల తమ కుమారుడి ఆత్మహత్యకు కారణమైన గద్వాల కృష్ణవేణి జూనియర్ కళాశాల యాజమాన్యం కరస్పాండెంట్ రమేష్, సూపరింటెండెంట్ రాజశేఖర్, లెక్చరర్ జిలాని ఒత్తిడి కారణంగా గతనెల 15వ తేదీన ధరూర్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన విద్యార్థి వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడని అప్పటినుండి ఇప్పటి వరకు తమ కుమారుడుఆత్మహత్యకు కారణమైన కృష్ణవేణి కళాశాల సిబ్బందిపైఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇప్పటికైనా స్పందించి కళాశాలను రదు చేసి కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాల ని గద్వాలడీఎస్పీ రంగస్వామికి వెంకటేష్‌తల్లిదండ్రులు మల్లేష్, గోవిందమ్మ వినతి పత్రం అందజేశారు.

## రాజాపూర్ మండల కేంద్రంలో జెకె ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

● హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు



జెకె ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**రాజాపూర్,జనవరి 9 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెకె ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌ను సోమవారం వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ప్యాలెస్ నిర్వాహకులు జహంగీర్ ముస్తఫా, గౌస్‌లు ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు యువకులకు స్వాగతం పలికారు. అన్ని రకాల శుభకార్యాలకు వివాహాది ఫంక్షన్‌లకు జెకె ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌ను తీర్చిదిద్దడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## మాజీ సర్పంచ్ గోపాల్ మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నిరంజన్ రెడ్డి, రావుల

**పెబ్బేరు,జనవరి9 ప్రభాతవార్త:** మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోపాలన భౌతికదేహానికి రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి లు పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామంలో మంచి వ్యక్తిని ప్రజలు కోల్పోయారని గ్రామాభివృద్ధిలో తనదైన ముద్రవేసుకొని ప్రజలతో మంచి వ్యక్తిగా గోపాల్ పేరు పొందారు అని అన్నారు. గోపాల్ మృతి చెందడంతో గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున బోరున విలపించారు. అంతిమయాత్రలోప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.





## సాతర్లలో అయోమయంలో ఇండ్ల స్థలాల లబ్ధిదారులు

● మాకు న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు లబ్ధిదారుల బైఠాయింపు
● విచారించి న్యాయం చేస్తానన్న జిల్లా అదనపు కలెక్టర్



ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్న సాతర్ల గ్రామస్తులు

**ఇటిక్యాల,జనవరి 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సాతర్ల గ్రామానికి చెందిన 62 మంది ఇళ్లస్థలాలు పొందిన లబ్దిదారులు సోమవారం దౌర్జన్యకారుల నుండి తమకు ప్రాణహాని ఉందని అలాగే గ్రామంలోని సర్వే నంబర్ 3 లో 1985 సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల భూమి మీదికాదు మాది అంటూ అదే గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి, అతని ముగ్గురు వారసులు, అదేవిధంగా ఆరుగురు అనుచరులు మాపై దౌర్జన్యం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అలాగే గుడిసెలు వేసుకున్న వాటిలో బండలు ధ్వంసం చేశారని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఇళ్ల స్థలాలు పొందిన లబ్దిదారులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఇళ్ల స్థలాల లబ్దిదారులు చేపట్టిన ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఇళ్ల స్థలాలు పొందిన లబ్దిదారులు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో వారు వివరిస్తూ 37 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామంలోని సర్వే నం.3లో 62 మంది నిరుపేద లబ్దిదారులకు ఇళ్ల స్థలాల కోసం భూమిని కేటాయించగా ఆ స్థలంలో కొంతమంది గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని, మరికొంతమంది కొత్తగా గుడిసెలు వేసుకోవడానికి పనులు చేసుకుంటున్నామని, మరికొంతమంది పశువుల పాకలు వేసకున్నారని ఇళ్ల స్థలాల భూమి మీది కాదని ఆ భూమి మాదని అంటూ అదే గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి, వారి ముగ్గురు వారసులు, అలాగే ఆరుగురు వారి అనుచరులు అందరు కలిపి మమ్మల్ని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అలాగే ఎండి షాలం అనే వ్యక్తిని కొట్టి అతని ఏర్పాటు చేసుకున్న గుడిసెలోని బండలను ధ్వంసం చేసి అక్కడ ఉన్న మహిళల పట్ల నీచంగా మాట్లాడి ఈ స్థలాన్ని ఖాళీ చేయాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అదేవిధంగా న్యాయవాది ద్వారా నోటీసులు పంపించారని నిరుపేద కుటుంబాలకు చెందిన వారం కావడంతో కోర్టు కేసును భరించలేని స్థితిలో ఉన్నామని, పై సమస్యను స్థానిక ఎస్సైకు కూడా ఫిర్యాదు చేశామని దౌర్జన్యకారుల నుండి మమ్మల్ని కాపాడాలని వారినుండి మాకు ప్రాణహాని ఉందని మాకు రక్షణ కల్పించి మా ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్‌ను ఇళ్ల స్థలాల లబ్దిదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. లబ్దిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి ఇళ్ల స్థలాల లబ్దిదారులకు న్యాయం చేస్తానని వారికి అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు.

## అనుమానంతో భార్యను గొంతు నులిమి చంపిన భర్త

**అయిజ,జనవరి 9 ప్రభాతవార్త :** కట్టుకున్న భార్యను అనుమానంతో గొంతు నులిమి చంపిన సంఘటన మండల పరిధిలోని ఉప్పల గ్రామంలో జరిగింది. సిఐ శివశంకర్‌గౌడ్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలని ఈడిగోనిపల్లి గ్రామానికి చెందిన చెల్లా పార్వతమ్మను ఉప్పల గ్రామానికి చెందిన గొల్ల కృష్ణకు గత నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని వారికి ఒక ఆడపిల్ల, ఒక మగపిల్లవాడు ఉన్నట్లు తెలిపారు. అయితే భార్యపై అనుమానంతో భర్త కృష్ణ ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో భార్య పార్వతమ్మను గొంతు నులిమి హతమార్చినట్లు తెలిపారు. మృతురాలు తండ్రి తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

## సర్పంచుల బిల్లుల పెండింగ్‌పై మండల సర్వసభలో గందరగోళం

● ఎంపీడీఓపై అసహనం వ్యక్తం చేసిన సర్పంచులు



మండల పరిషత్ సభలో పాల్గొన్న మండల నాయకులు

**అడ్డాకుల,జనవరి 9 ప్రభాతవార్త:** అడ్డాకుల మండల ప్రజా పరిషత్ సమావేశంలో సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రావడంలేదని అప్పులు తెచ్చి పనులు పూర్తి చేసిన రాకపోవడంతో గ్రామాలలో తల ఎత్తుకోలేక పోతున్నామని సర్పంచులు మండల సభలో అధికారులను నిలదీశారు. మండల సభకు ఎంపీపీ నాగార్జున రెడ్డి అధ్యక్షత వహించగా జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాఖపూర్ సర్పంచ్ జయన్న గౌడ్ మాట్లాడుతూ క్రిమిటోరియం ఇంకుడు గుంతలె, క్రీడాప్రాంగణాలు ఇతర పనులు చేసిన వాటికి బిల్లులు అందజేయాలని సభ దృష్టికి తీసుకువెళ్లారు. డిజిటల్ కి ఎంపీడీఓ దగ్గర ఉండకుండా పంచాయితీ కార్యదర్శులకు అందజేయాలని కోరారు. అందుకు జడ్పీటీసీ కల్పించుకొని ఇట్టి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సంక్రాంతి అనంతరం బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాచల సర్పంచ్ తిరుపతయ్య మాట్లాడుతూ మంత్రి స్వగ్రామమైన రాచల గ్రామానికి బీటీ రోడ్డు లేనందున గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా రోడ్డు వేయాలని సభకు సూచించగా అందుకు జడ్పీటీసీ సమాధానం ఇస్తూ వెంబడే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జడ్పీటీసీ మాట్లాడుతూ వచ్చే మండల సభకు డీఈ లు తప్పకుండా రావాలని వారు రానిఎడల మండల సభ వాయిదా వేయాలని ఎంపీడీఓ మంజులకు సూచించారు. మిషన్ భగీరథ డీఈ లకు ఫోన్ చేసి మేజెజ్ లు పెట్టిన స్పందించడం లేదని ఎంపీడీఓ మంజుల జడ్పీటీసీ కి సమాధానం ఇచ్చారు. అనంతరం మిషన్ భగీరథ నీళ్లపై జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా తిమ్మాయిపల్లి తాండాలో ఎలాంటి బోరు సౌకర్యం లేదని వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత మిషన్ భగీరథ ఏఈలకు సూచించారు. విద్యుత్ శాఖపై చర్చలు జరుగుతుండగా గుడిబండ ఎంపీటీసీ శకుంతల మాట్లాడుతూ 40 స్థంభాలనఎ విద్యుత్ లైన్ లేనందున కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థంభాలకు కేబుల్ వైరు వేయాలని సభకు సూచించారు. ఎంపీటీసీ రంగన్న గౌడ్ మాట్లాడుతూ అడ్డాకుల మండలంలోని గ్రామాలకు రేషన్ బియ్యం సన్న బియ్యం రావడం లేదని పక్కన ఉన్నటువంటి పెద్దమండడి మండలానికి సన్న బియ్యం వస్తుందని ఈ మండల గ్రామల ప్రజలు ఆ గ్రామాలకు వెళ్లి బియ్యాం తెచ్చుకుంటున్నారని సన్న బియ్యం అందించాలని సభకు సూచించారు. ఈకార్యక్రమానికి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ లు, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## బధిత కుటుంబానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

**కొత్తకోట,జనవరి 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు జడ్పీ వైస్ చైర్మెన్ వామన్ గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో కొత్తకోట మండలానికి చెందిన మిరాసిపల్లి గ్రామవాసి రామన్‌గౌడ్ ఇటీవల 15రోజుల క్రితం బైక్ ఆక్సిడెంట్ కావడం జరిగింది. వారి కుటుంబ పరిస్థితి రోజూ కూలీ పని చేస్తే తప్ప వారి జీవనం సాగేలా లేదు చాలా కష్టంగా ఉందని ప్రస్తుతం వారి భార్య మాత్రమే కూలీ పని చేసి కుటుంబానికి ఆసరాగా ఉందని, గ్రామంలో అద్దె ఇల్లు తీసుకొని కిరాయి చెల్లిస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కమిటీ దృష్టికి నిన్న రాత్రి రావడం జరిగింది. సమాచారం అందిన వెంటనే జిల్లా కమిటీ కొత్తకోట మండల కమిటీ స్పందించి వెంటనే ఆ గ్రామానికి వెళ్లి రామన్‌గౌడ్ ని పరామర్శించి వారికి ప్రథమ చికిత్స నిమిత్తం రూ.20వేల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఇంకా ఏదైనా సహాయం చేయవలసి వస్తే జిల్లా కమిటీ భవిష్యత్తులో కూడా ముందు ఉంటుందని వారికి హామీ ఇవ్వడం జరిగింది. బాదిత కుటుంబానికి తమ వంతు ఆర్థిక సహాయంగా జిల్లాలోని చాలామంది గౌడ సోదరులు తమ ఉదారమైన స్వభావంతో వారు ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈకార్యక్రమంలో వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు పలుస శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, ఉపాధ్యక్షులు భగవంత్ గౌడ్, నాగవరం వెంకటేష్ గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ అక్కల నరేందర్ గౌడ్, మీడియా కన్వీనర్ సారే పురేందర్ గౌడ్, వనపర్తి పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు భత్తుల వినోద్ గౌడ్, మదనాపురం మండల గౌడ సంఘం అధ్యక్షులు మహాదేవన్ గౌడ్, మీరాసిపల్లి గ్రామ అధ్యక్షులు జీవన్‌గౌడ్, కొత్తకోట పట్టణ అధ్యక్షులు వెంకన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య గౌడ్, అమడబాకుల అధ్యక్షులు రామన్‌గౌడ్, ముమ్మలపల్లి అధ్యక్షులు జి.శ్రీనివాస్ గౌడ్, రానిపేట గ్రామ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, చర్లపల్లి నరసింహ గౌడ్, కానేపల్లి అధ్యక్షులు రవీందర్ గౌడ్, నాటవెల్లి గ్రామ అధ్యక్షులు కృష్ణయ్యగౌడ్, సంకిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, పాపురం గ్రామానికి చెందిన రాఘవేందర్ గౌడ్, వనపర్తి మండల గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్, వనపర్తి గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతయ్య గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజల శాంతి భద్రతలను పరిరక్షించడమే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుంది

● గద్వాల జిల్లా ఎస్పీ రంజన్ రతన్‌కుమార్



**గద్వాల టౌన్,జనవరి 9 ప్రభాతవార్త :** ప్రజల శాంతి భద్రతలను పరిరక్షించే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం పని చేస్తుందని అందులో భాగంగా ప్రజల నుండి పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు చట్ట పరిధిలో పరిష్కరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రంజన్ రతన్‌కుమారన తెలిపారు. ప్రజావాణిలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి ప్రజల నుండి వచ్చిన 11 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భూ వివాదాలకు సంబంధించిన సివిల్ వివాదాల విషయంలో ఎవరు కూడా పోలీస్ స్టేషన్‌లకు తిరుగుతూ తమ సమయాన్ని వృధా చేసు కోవద్దని, సివిల్ వివాదాలు పోలీస్ స్టేషన్‌లలో పరిష్కరించబడవనే విషయాన్ని గ్రహించాలని సివిల్ వివాదాలు కోర్టులలో పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. అమాయక ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి భూముల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించడం, ఇతర చీటింగ్ చేసే వారిపై కఠినంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. మహిళల భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదునుచట్ట ప్రకారం పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

## విద్యుత్ షాక్‌తో రైతుమృతి

**అయిజ,జనవరి 9 ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన బోయ తిమ్మప్ప (45) అనే రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం తన వ్యవసాయ పొలంలో విద్యుత్ వైర్లు మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆకస్మికంగా విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని మృతుడి బంధువులు కోరుతున్నారు.

## మల్దకల్ శ్రీతిమ్మప్పస్వామి హుండీ లెక్కింపు

**మల్దకల్,జనవరి 9 ప్రభాతవార్త :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు వేసిన నగదు లెక్కింపును దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వరమ్మ దేవాలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీకృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమానికి గద్వాలకు చెందిన 120 మంది మహిళా భక్తులు దేవాలయ సిబ్బంది ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సంవత్సరం రూ. 20,11,734 కాగా గత ఏడాది రూ.16,47,462 కంటేఈసారి రూ .3,64,772 ఆదాయంలో లభించిందని దేవాలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే శ్రీ చింతల ముని దేవాలయం హుండీ లెక్కింపు జరగగా రూ.1,04,074 రాగా గత ఏడాది రూ.88,625 కంటే ఈసారి రూ. 15,449 అధికంగా ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. భక్తులు తమ కానుకలు హుండీలో వేసినట్లయితే స్వామివారికి జరిగేకైంకర్యాలు సేవలు పొందుటకు వీలుంటుందని దేవాలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, పద్మారెడ్డి, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి 2023 – 24 ప్రణాళికలు సిద్ధం

**వనపర్తి ప్రతినిధి,జనవరి 9 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామాల అభివృద్ధికి 2023,24కు సంబంధించిన ప్రణాళికలు సిద్దం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం వనపర్తి ఎంపిడిఓ సమావేశ మందిరంలో 2023,24కు సంబంధించిన గ్రామ పంచాయతీ ప్రణాళిక ఏర్పాటుపై ఎంపిడిఓ, ఎంపిఓ, కంప్యూటర్ ఆపరేటర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో కొత్తకోట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం పట్ల అభినందించారు. నీటి సరఫరాలో ఇంటింటికి ఫంక్షనల్ కులాయి సౌలభ్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ ఇతర అవసరాలకు నీటి లభ్యత చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డిఆర్‌డిఎ అధికారి నరసింహులు, డిపిఓ సురేష్‌కుమార్, ఎంపిడిఓలు,ఎంపిఓలు పాల్గొన్నారు.

